


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




బుధవారం 16-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :90 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఉద్యోగులతో పెట్టుకుంటే ఓటమి ఖాయం!


2 లో

- ఉద్యోగులతో పెట్టుకున్నవాళ్లు మళ్లీ గెలవలేదు
- కాంగ్రెస్ సర్కార్ ఓటమి ఖాయమన్న కవిత
- ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నిర్లక్ష్యం ఎందుకు?
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలు
- విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ఉద్యోగులను అభివృద్ధి భాగస్వాములుగా చూస్తాం

## ఫలక్‌నుమా వేదికగా కీలక భేటీ!

- రహీమ్ ఆగా ఖాన్‌తో రేవంత్ భేటీ
- వారసత్వ కట్టడాలపై ప్రత్యేక ఫోకస్
- పాతబస్తీ అభివృద్ధికి సహకారం కోరిన సీఎం
- మూసీ పునరుజ్జీవంపై కీలక చర్చ
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి పునరుద్ధరణ
- మూసీ పరివాహక ప్రాంతంలో నైట్ ఎకానమీ
- ఫ్యూచర్ సిటీకి భారీ ప్రణాళికలు
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం



న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని చారిత్రాత్మక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వారసత్వ సంపద పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం, పాతబస్తీ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణ వంటి పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని చారిత్రాత్మక భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు ఎంతో గౌరవం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలోని వారసత్వ కట్టడాలను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

ఆగా ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక కుతుబ్‌షాహీ టూంబ్స్ పునరుద్ధరణలోనూ ఆగా ఖాన్ ఫౌండేషన్ భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు.

2 లో

## ఎర్రవల్లి కేసులో ప్రభుత్వానికి షాక్!

- ఎర్రవల్లి శుద్ధి వివాదంపై హైకోర్టు కీలక ఆదేశాలు
- నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దని ఆదేశం
- నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని స్పష్టం
- ఏడేళ్లలోపు శిక్ష సెక్షన్లపై కోర్టు ప్రశ్నలు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విస్మరించడంపై ఆగ్రహం
- పోలీసుల దూకుడుకు హైకోర్టు బ్రేక్
- కాంగ్రెస్ ప్రభుత్వానికి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ

2 లో

## శంకర్‌పై రౌడీషీట్ రీ-ఓపెన్!

- బెదిరింపుల ఆరోపణలపై పోలీస్ యాక్షన్
- 2019లో మూసిన షీట్ పునరుద్ధరణ
- బిల్డర్ ఫిర్యాదుతో దందాలు వెలుగులోకి
- కుటుంబాన్ని చంపేస్తామంటూ బెదిరింపులు
- పలు పోలీస్ స్టేషన్లలో కేసులు
- ప్లాట్ల విక్రయంపైనా ఆరోపణలు
- వరుస కేసులతో దర్యాప్తు వేగవంతం


2 లో

న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం): బెదిరింపులు, అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై చిన్నబోయిన శంకర్ అలియాస్ 'అంబర్‌పేట్ శంకర్'పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. అతడిపై రైడీషీట్ ను తిరిగి ఓపెన్ చేశారు. సత్ప్రవర్తన కింద శంకర్‌పై గతంలో నమోదైన రౌడీషీట్‌ను 2019లో పోలీసులు మూసివేశారు. అయితే ఆయనపై ఇటీవల వరుసగా తీవ్రమైన నేరారోపణలు వెలుగులోకి రావడం, కొత్త కేసులు నమోదు కావడంతో అంబర్‌పేట్ పోలీసులు గతంలో మూసివేసిన రౌడీషీట్‌ను పునరుద్ధరించినట్లు సమాచారం.

బిల్డర్ జి.అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇటీవల శంకర్ దందాలు మళ్లీ బయటపడ్డాయి.

## విజయవాడలో డివిజన్ల భారీ పెంపు!

- విజయవాడ కార్పొరేషన్‌లో డివిజన్ల భారీ పెంపు
- 64 నుంచి 86కు డివిజన్ల సంఖ్య పెంపు
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- 86 డివిజన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు
- జనాభా పెరుగుదలతో పునర్వ్యవస్థీకరణ
- వార్డుల వారీగా సమస్యల పరిష్కారానికి అవకాశం
- అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత చేరువ

2 లో

## యువతదే దేశ భవిష్యత్ బాధ్యత!

- దేశం మనకేం చేసిందని కాదు..
- మనం ఏం చేయగలమో ఆలోచించండి
- జెన్ జీ, జెన్ ఆల్ఫా మాటలు వినేందుకు సిద్ధం
- యువత నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలి
- దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి
- మోదీ నాయకత్వంలో భారత్ ఆర్థిక పురోగతి
- తమిళనాడులో ఉద్యోగ అవకాశాలకు కొత్త ఊతం
- మహిళా సాధికారతకు కేంద్రం ప్రత్యేక చర్యలు

2 లో

## ఏపీ రాజకీయాల్లో మరో విషాదం!


2 లో

న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం): ఏపీ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో మరణించారు. విశాఖలోని తన నివాసంలో నాని కన్నుమూసినట్టు సమాచారం.

## విజయవాడలో బాంబుల కలకలం!


2 లో

- ఆర్టీసీ బస్సులో పేలుడు పదార్థాలతో కలకలం
- ప్రయాణికుడి అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- బ్యాగులో 46 జిలెటిన్ స్టిక్స్.. 50 డిటోనేటర్లు
- బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు
- పేలుడు పదార్థాలు ఎక్కడికి తరలిస్తున్నారు?
- సీసీటీవీ ఫుటేజీలతో పోలీసుల దర్యాప్తు ముమ్మరం
- విజయవాడలో భద్రత కట్టుదిట్టం చేసిన అధికారులు

# ఫిరాయింపుల రివర్స్ గేర్!



న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం): బీఆర్ఎస్ గుర్తు మీద గెలిచి అధికార కాంగ్రెస్‌తో అంటకాగుతూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న శాసనసభ్యులు తిరిగి సొంత గూటి బాట పట్టేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత గూటికి చేరగా.. త్వరలోనే మరికొందరు అదే బాట పట్టనున్నారని పార్టీ కీలక నాయకుల ద్వారా తెలిసింది. మరో ముగ్గురు ఎమ్మెల్యేలు అదే బాటలో ఉన్నట్టు సమాచారం. ఆ ముగ్గురు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం. ఈ విషయాన్ని కేటీఆర్.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వద్దకు తీసుకువెళ్లినట్టు తెలిసింది.

మిగతాది 2 లో..

- ముగ్గురు ఎమ్మెల్యేలు టచ్‌లోకి!
- కేసీఆర్‌కు కేటీఆర్ కీలక సమాచారం
- జిల్లా నేతల అభిప్రాయాలకే ప్రాధాన్యం
- రీఎంట్రీకి గులాబీ గేట్లు ఓపెన్!
- ఫిరాయింపుదారులపై అధిష్ఠానం వ్యూహం
- సాధారణ నేతలుగానే గుర్తింపు
- ఆరుగురికి నో ఎంట్రీ!
- కాంగ్రెస్‌కు వలసల షాక్!

## యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్

- రూ.2 వేలపై లావాదేవీలపై కన్ను
- ఎండీఆర్‌కు మార్గం సుగమమైందని ఆరోపణ
- 5 శాతం లావాదేవీలే.. 65 శాతం విలువ
- జీరో ఎండీఆర్ విధానంపై దుమారం
- వ్యాపారులపై ఛార్జీలకు అవకాశం
- భారం వినియోగదారులపైనే రాహుల్
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శలు



న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం): యూపీఐ లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రాజకీయ దుమారం రేపుతోంది. యూపీఐ లావాదేవీలపై ఫీజులు వసూలు చేయడానికి ప్రభుత్వం రహస్యంగా మార్గం సుగమం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రూ. 2,000 దాటిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించడానికి మోడీ ప్రభుత్వం అనుమతించిందన్నారు. రూ. 2,000 పైబడిన లావాదేవీల సంఖ్య కేవలం 5 శాతమే అయినప్పటికీ.. మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో సుమారు 65 శాతం ఈ లావాదేవీల నుంచే వస్తుందని పేర్కొన్నారు.

2 లో

## ఏఐ పట్టించిన దొంగ

- 45 ఏళ్ల నాటి కేసుకు ఎండ్ కార్డు
- బంగారు హారం దొంగతనం కేసు
- మారు పేరుతో తప్పించుకున్న మహిళ
- సోషల్ పోస్టుతో యజమానికి అనుమానం
- ఫొటో చూసి పోలీసులకు ఫిర్యాదు
- నేరాన్ని అంగీకరించిన మహిళ



న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం): సోషల్ మీడియాలో ప్రస్తుతం 80s ట్రెండ్ నడుస్తోంది. 1980లో జీవించి ఉంటే నాడు తాము ఎలా ఉండేవారిమో చూసుకునేందుకు ప్రస్తుత ఫోటోలను ఏఐ సహాయంతో క్రియేట్ చేసి తమ సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టులు చేస్తున్నారు. ఇన్ స్టా, ఫేస్ బుక్, ఎక్స్ ఏది ఓపెన్ చేసినా కాలం గిర్రున వెనక్కి తిరిగిందా అన్నట్లు అందరి వాల్స్ మీద 80ల నాటి ఫోటోలే దర్శనం ఇస్తున్నాయి. ఇండియాను ఊపేస్తున్న ఈ 80ల నాటి ట్రెండ్ 45 ఏళ్లుగా అంతుచిక్కకుండా పోయిన ఓ దొంగను పట్టించింది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా సోషల్ మీడియాలో నడుస్తున్న ఈ ట్రెండ్ నాలుగు దశాబ్దాల నాటి కేసుకు ఫుల్ స్టాప్ పెట్టింది.

45 ఏళ్లుగా మారు పేరుతో..

ఇంటర్నెట్?లో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం..

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 16-09-2026

# ఎర్రవల్లి కేసులో ప్రభుత్వానికి షాక్!



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపిన ఎర్రవల్లి పసుపు నీళ్లతో శుద్ధి వివాదంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో నమోదైన కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం నోటీసులు మాత్రమే ఇచ్చి దర్యాప్తు జరపాలని తేల్చిచెప్పింది. ఇక ఇరు పక్షాల వాదనలు వినిపిస్తున్న క్రమంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో నిందితులను ఎలా అరెస్టు చేస్తారంటూ ప్రభుత్వ తీరును కోర్టు మందిలిస్తూ గట్టిగా ప్రశ్నించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటిని విస్మరించి మళ్లీ ఎలా అరెస్టులకు పాల్పడతారంటూ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది.

కాగా, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం, ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తూ అరెస్టులకు సిద్ధమవ్వగా, ఆ అరెస్టును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం హైకోర్టు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని పోలీసులను హెచ్చరిస్తూ తదుపరి చర్యలకు బ్రేక్ వేసింది.

# యువతదే దేశ భవిష్యత్ బాధ్యత!



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశం మనకేం చేసిందో కాకుండా దేశానికి మనం ఏం చేయగలమో ఆలోచించాలని అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ యువతకు పిలుపునిచ్చారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా చెప్పేది వినేందుకు మేం సిద్ధమేనని అయితే మీరు మిమ్మల్ని జెన్ జెడ్ అని పిలుచుకున్నా, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా, మీరందరూ చెప్పేది వినడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది?మీ పాత్ర ఏమిటి? మీ ద్వారా దేశానికి ఏమి సాధించవచ్చు అనే విషయాలపై మీరు తప్పక ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత నాయకత్వ బాధ్యతలను స్వీకరిస్తూ దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

యువతదే బాధ్యత:

పట్టభద్రులవుతున్న విద్యార్థులు వారి వారి రంగాలలో నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని నిర్మలా సీతారామన్ కోరారు. మీరు నాయకత్వం వహించాలి, దేశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. దేశం సురక్షితంగా, బలంగా ఉన్నప్పుడే మనం నివసించడానికి ఒక ఇల్లు ఉంటుంది. మనం మన దేశాన్ని ఎన్నటికీ వదులుకోకూడదని సూచించారు. రష్యా-యుక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు వంటి ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధి రేటును సాధించి స్థిరంగా ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరిగిన ఉపాధి అవకాశాలను వివరిస్తూ శ్రీపెరంబుదూర్-ఒరగడం కారిడార్ నేడు ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ ఎగుమతులకు ప్రపంచ కేంద్రంగా మారిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో దాదాపు 10 శాతం (350 కేంద్రాలు) ఒక్క తమిళనాడులోనే ఉన్నాయని తెలిపారు.

మహిళా సాధికారతపై..

మహిళలు ఉద్యోగ రంగాల్లోకి రావడం కోసం STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) విద్యను పూర్తి చేసిన వారి కోసం ప్రతి జిల్లాలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. తిరుక్కురళ్ లోని పద్యాలను ఉదహరిస్తూ.. యువత ఎంతటి విజయాలు సాధించినా అహంకారాన్ని పక్కనబెట్టి, వినయం, సహనంతో సవాళ్లను ఎదుర్కోవాలని కొత్తగా పట్టాలు పొందిన విద్యార్థులకు ఆమె హితవు చెప్పారు.

# విజయవాడలో డివిజన్ల భారీ పెంపు!




**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించడంతో పాటు, ప్రజలకు మెరుగైన పాలన అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల సంఖ్యను పెంచుతూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా నిర్ణయంతో ఇప్పటి వరకు ఉన్న మొత్తం 64 డివిజన్లను ఏకంగా 86కు పెరిగాయి.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా..

రాబ్యే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిగా కొత్తగా ఏర్పాటైన 86 డివిజన్ల ప్రకారమే నిర్వహించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జీవో విడుదల కావడంతో ఎన్నికల ప్రక్రియ దిశగా అడుగులు పడుతున్నాయి. నగర జనాభా పెరుగుదల, భౌగోళిక విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. దీంతో వార్డుల వారీగా సమస్యల పరిష్కారం సులభం కావడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత చేరువవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఉద్యోగులతో పెట్టుకుంటే ఓటమి ఖాయం!

**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఉద్యోగులతో పెట్టుకున్న వాళ్లెవరూ మళ్లీ అధికారంలోకి రాలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఓడిపోవడం ఖాయం అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉపాధ్యాయ, యుద్యోగుల సమస్యలపై ఇవాళ హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రేవంత్ రెడ్డి సర్కార్? ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నదని, ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ వారిని నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో వచ్చేది మా ప్రభుత్వామే అని మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులను అభివృద్ధిలో డెవలపర్స్ గా చూస్తామన్నారు. ఉద్యోగులను సంతోష పెట్టేలా, వారిని గౌరవించేలా మా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.

630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలు!:

తెలంగాణ ఉద్యమం సమయంలో ఉపాధ్యాయులంతా కూడా ఉద్యోగం కన్నా ఉద్యమమే ముఖ్యమని పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో 630 మండలాలకు కేవలం 8 మంది పర్మనెంట్ ఎంఈఓలు ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందించాలంటే పటిష్టమైన విద్యా పరిపాలన అవసరం అని విద్యార్థులకు పేషీయల్ రికగ్నేషన్, రిపోర్ట్ లు అంటూ టీచర్లు పాఠాలు చెప్పకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇక ఒకే టీచర్ ఉన్న స్కూళ్లలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమం చేయలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేరు గొప్ప అమలు జరగడం లేదన్నారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలకు ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంకా స్పందించడం లేదన్నారు.

# ఏపీ రాజకీయాల్లో మరో విషాదం!

మొదటి పేజీ తరువాయి

ఏలూరు నుండి ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వైసీపీ హయాంలో ఆరోగ్యశాఖమంత్రిగా సేవలు అందించారు. 1994లో ఏలూరు నియోజకవర్గం నుండి మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి ఓటమిపాలయ్యారు. 2004లో టీడీపీ అభ్యర్థి అంబికా కృష్ణపై 33,053ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు.

2009లోనూ కాంగ్రెస్ పార్టీ నుండి విజయం సాధించారు. తరవాత 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2019లో మరోసారి ఏలూరు నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు నియోజకవర్గంలో, వైసీపీలో కీలక నేతగా వ్యవహరించిన నాని మరణంతో ఇటు నియోజకవర్గంలో, అటు పార్టీలో విషాదచాయలు అలుముకున్నాయి.

# ఫలక్‌నుమా వేదికగా కీలక భేటీ!

మొదటి పేజీ తరువాయి

మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక కట్టడాలను కూడా ఈ ప్రణాళికలో భాగంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు.

పాతబస్తీలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారం అందించాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఉస్మానియా ఆస్పత్రి కోసం గోషామహల్‌లో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని.. ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రి భవనాన్ని వారసత్వ కట్టడంగా పరిరక్షించి అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని వివరించారు.

హైదరాబాద్‌లో మూసీ నది పునరుజ్జీవంతో పాటు దాని పరివాహక ప్రాంతాన్ని ఆర్థిక కార్యకలాపాలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీకి అనుగుణంగా అభివృద్ధి చేసే ప్రణాళికలను ప్రిన్స్ రహీమ్‌కు వివరించారు. వారసత్వ సంపద పరిరక్షణతో పాటు నగర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ ను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం పలికారు. ఈ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రిన్స్ రహీమ్ వెల్లడించారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాల దూరంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

తమిళనాడు సీఎం విజయ్ కామెంట్లపై స్టాలిన్ కౌంటర్లు

సింగపూర్‌కు చెందిన సంస్థ రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొత్తం 30 వేల ఎకరాల్లో 15 వేల ఎకరాలను గ్రీన్ జోన్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, గ్రీన్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు వివరించారు.

ఫలక్‌నుమా ప్యాలెస్‌లో సీఎం రేవంత్ రెడ్డి మరియు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-వీ మధ్య జరిగిన చర్చలపై మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి. వారసత్వ సంపద పరిరక్షణ మరియు పాతబస్తీ అభివృద్ధి విషయంలో మీరు ఏ మార్పులు ఆశిస్తున్నారు?

# యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం తాజాగా యూపీఐ ద్వారా రూ.2,000 వరకు చేసే లావాదేవీలపై.. అలాగే రూపే డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులపై బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని కేంద్రం ఆదేశించింది. అయితే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై మాత్రం ఛార్జీలు పడనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది.

"మోడీ ప్రభుత్వం యూపీఐపై ఫీజులు విధించేందుకు నిశ్శబ్దంగా తలుపులు తెరిచింది. ఇప్పుడు రూ.2,000కు మించిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించవచ్చు. ఇలాంటి లావాదేవీలు పరిమాణం పరంగా కేవలం 5 శాతం ఉన్నప్పటికీ.. యూపీఐ మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయి" అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అయితే రూ.2,000కు మించిన లావాదేవీలపై వ్యాపారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తారా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించలేదు. ఇప్పటివరకు లావాదేవీ మొత్తంతో సంబంధం లేకుండా యూపీఐ చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు లేవు.

'భారం వినియోగదారులపైనే'

యూపీఐ వినియోగదారులపై నేరుగా ఎలాంటి ఫీజులు ఉండవని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వ్యాపారులపై విధించే ఛార్జీల భారం చివరికి వినియోగదారులపైనే పడుతుందని రాహుల్ గాంధీ అన్నారు. "వినియోగదారుల నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. కానీ దుకాణదారులపై విధించే ఫీజులు చివరికి ఎక్కడి నుంచి వస్తాయి? ధరలు పెంచి.. నేరుగా వినియోగదారుల జేబు నుంచే వస్తాయి" అని వ్యాఖ్యానించారు. అమెరికాకు చెందిన పేమెంట్ కంపెనీలు చాలా కాలంగా భారత్‌లో అమలవుతున్న జీరో-ఎండీఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఆ విధానాన్ని మార్చే దిశగా మార్గం సుగమం చేసిందని ఆరోపించారు.

# విజయవాడలో బాంబుల కలకలం!




**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సిటీలో పేలుడు పదార్థాలు లభించడం తీవ్ర కలకలం రేపింది. నరసరావుపేట నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులో భారీగా పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. ఓ ప్రయాణికుడి అప్రమత్తతతో విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసిఫ్ అలీ అనే ప్రయాణికుడు నరసరావుపేట నుంచి విజయవాడకు బస్సులో ప్రయాణించారు. బస్సు దిగిన తర్వాత ఆయన పొరపాటున తనది కాని వేరే బ్యాగును తీసుకున్నారు.

కొంత సమయం తర్వాత ఆ బ్యాగును తెరిచి చూడగా అందులో పేలుడు పదార్థాలు ఉండటాన్ని గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే సమీపంలోని బస్టాండ్ పోలీస్ అవుట్ పోస్టుకు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కృష్ణలంక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆ బ్యాగును స్వాధీనం చేసుకుని పరిశీలించగా.. అందులో 46 జిలెటిన్ స్టిక్స్, 50 ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి బస్సుతోపాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈ ఘటనపై కృష్ణలంక ఎస్సై గిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పేలుడు పదార్థాలను ఎవరు తీసుకొచ్చారు..? వీటిని ఎక్కడికి తరలిస్తున్నారు..? అనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్టాండ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను, ప్రయాణికుల వివరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి సమాచారం అందించిన ప్రయాణికుడు ఆసిఫ్ అలీని అధికారులు అభినందించారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# ఏఐ పట్టించిన దొంగ

మొదటి పేజీ తరువాయి

మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని ఓ చిన్న స్వర్ణకారుడి దుకాణంలో ఓ యువతి 45 ఏళ్ల క్రితం బంగారు హారం కొట్టేసి అక్కడి నుంచి పారిపోయింది. ఆ తర్వాత పోలీసులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె ఎవరు? ఎక్కడికి వెళ్లింది? ఎలా అదృశ్యమైంది? అనేది సమాధానం లేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలో కాలం గడిచిపోసాగింది. ఇక ఆ యువతి తన పేరును మార్చుకుని ఎవరికి అనుమానం రాకుండా మరో వ్యక్తిలా జీవించడం మొదలు పెట్టింది.

తలకిందులు చేసిన ఏఐ టెక్నాలజీ:

అలా 45 ఏళ్లుగా ఎవరికీ చిక్కకుండా జీవనం సాగిస్తున్న ఆ మహిళ ఇక అంతా ముగిసిపోయిందని అనుకుంది. కానీ 2026లో ఒక ఏఐ ఫొటో ఆమె జీవితాన్ని తలకిందులు చేసింది. 80ల నాటి ట్రెండ్‌లో తనను తాను చూపించుకోవాలనే సరదాతో ఏఐ తో ఓ పాతకాలపు ఫొటోను తయారు క్రియేట్ చేసుకుంది. ఆ ఫొటోను జ్ఞాపకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే ఆ ఫోటో ఆశ్చర్యకరంగా 45 ఏళ్ల క్రితం ఆ బంగారు హారం దొంగిలించబడిన దుకాణం యజమాని కంటపడింది. 45 ఏళ్ల క్రితం తన దుకాణంలో కనిపించిన ఆ యువతి ముఖం... ఇప్పుడు సోషల్ మీడియాలో కనిపిస్తున్న ముఖం ఒకే రకంగా ఉండటంతో ఆలోచనలో పడ్డాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో విచారణ జరపగా 45 ఏళ్ల క్రితం జరిగిన ఆ దొంగతనాన్ని ఆమె అంగీకరించింది. దీంతో 45 ఏళ్లుగా మూసుకుపోయిన ఆ కేసు మళ్లీ 80s ట్రెండ్ దెబ్బకు ఎండ్ కార్డు పడినట్లైంది.

# శంకర్‌పై రౌడీషీట్ రీ-ఓపెన్!



**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** బెదిరింపులు, అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై చిన్నబోయిన శంకర్ అలియాస్ 'అంబర్‌పేట్ శంకర్'పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. అతడిపై రైడీషీట్ ను తిరిగి ఓపెన్ చేశారు. సత్ప్రవర్తన కింద శంకర్‌పై గతంలో నమోదైన రౌడీషీట్‌ను 2019లో పోలీసులు మూసివేశారు. అయితే ఆయనపై ఇటీవల వరుసగా తీవ్రమైన నేరారోపణలు వెలుగులోకి రావడం, కొత్త కేసులు నమోదు కావడంతో అంబర్‌పేట్ పోలీసులు గతంలో మూసివేసిన రౌడీషీట్‌ను పునరుద్ధరించినట్లు సమాచారం.

బిల్డర్ జి.అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇటీవల శంకర్ దందాలు మళ్లీ బయటపడ్డాయి. ఒక సెటిల్‌మెంట్ వ్యవహారంలో తమకు అనుకూలంగా ఒప్పుకోవాలని, లేదంటే కుటుంబసభ్యులను చంపేస్తామని శంకర్‌తో పాటు ఆయన అనుచరులు బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా జూబ్లీహిల్స్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఆయనపై బెదిరింపుల ఆరోపణలు వచ్చాయి. గత జూన్‌లో గాజులరామారంలో బిల్డర్‌కు తెలియకుండా ప్లాట్లను విక్రయించిన ఘటనతో పాటు, ఒక న్యూస్ ఛానెల్ నిర్వాహకుడికి సంబంధించిన వివాదంలో మధ్యవర్తిగా ఉంటూ బెదిరించారనే ఆరోపణలపై కూడా శంకర్‌పై కేసులు ఉన్నట్లు సమాచారం. ఈ వరుస కేసుల నేపథ్యంలోనే అంబర్‌పేట్ పోలీసులు శంకర్‌పై మళ్లీ రౌడీషీట్ రీ-ఓపెన్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఫిరాయింపుల రివర్స్ గేర్!

మొదటి పేజీ తరువాయి

అయితే, వారిని చేర్చుకునే క్రమంలో ఆయా జిల్లాలకు చెందిన ముఖ్య నేతల అభిప్రాయాలు తెలుసుకోవాలని కేసీఆర్ సూచించినట్టు సమాచారం. జిల్లా నేతల అభిప్రాయాలు, ఆలోచనలకు అనుగుణంగానే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించగా.. కేటీఆర్ ఆయా జిల్లాలకు చెందిన ముఖ్యనేతలతో సంప్రదింపులు జరిపి వారి అభిప్రాయాలను తెలుసుకున్నట్టు సమాచారం.

పార్టీకి మైలేజ్.. ప్రజల్లోకి బలమైన సంకేతాలు

ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు తిరిగి రావడం ద్వారా పార్టీకి మైలేజ్ వస్తుందని, అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ అని, అదే సమయంలో అధికార కాంగ్రెస్ నుంచి వలసలు ప్రారంభం అయ్యాయని, ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదనే సంకేతాలను ప్రజలకు పంపించినట్టు అవుతుందని కేటీఆర్ జిల్లా నేతలకు చెప్పినట్టు సమాచారం. అయితే, ఆ నేతలను తిరిగి చేర్చుకుందామని, కానీ వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా సాధారణ నేతలుగా చూడాలని జిల్లా నేతలు కేటీఆర్‌కు చెప్పినట్టు తెలిసింది. దీంతో వారి చేరిక దాదాపుగా ఖయమైందని సమాచారం.

వీరు రావడం కష్టమే..

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కడియం కావ్య, కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగాలని బలంగా నిర్ణయించుకున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్‌లో కొనసాగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ పీఏసీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక సైతం వివాదాస్పదంగా మారింది. ఆయన తీరుపై బీఆర్ఎస్ పార్టీ కొంత ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. ఇక జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌కు రావడంతో వివాదం చెలరేగింది. దీంతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి గులాబీ గూటికి చేరారు. ఈ నేపథ్యంలో సంజయ్ వెళ్లడం కానీ, బీఆర్ఎస్ పార్టీ ఆయన్ను తీసుకోవడం రెండు లేవని తెలిసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే కాంగ్రెస్ బీఫాం మీద ఎంపీగా పోటీ చేశారు. ఆయనపై పార్టీ ఫిరాయింపుల కేసు ఉంది. మిగిలిన వారిపై కేసు ఉన్నా... 'దానం' అంత బలమైన ఆధారాలు మిగిలిన వారి విషయంలో లేవని తెలిసింది. దానం నాగేందర్ సభ్యత్వం ఏనాటికైనా రద్దు అవుతుందని, అందుకే ఆయన వస్తానన్నా చేర్చుకోవద్దని బీఆర్ఎస్? నేతలు అధిష్టానానికి సూచించినట్టు సమాచారం. చేవేళ్ల ఎమ్మెల్యేను తిరిగి తీసుకోవడానికి స్థానికంగా ఉన్న మాజీమంత్రి అభ్యంతరం తెలిపినట్టు సమాచారం. దీంతో ఆయన చేరిక నిలిచిపోయినట్టు తెలిసింది. ఇలా ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో కొనసాగడం ఖాయమైంది. వీరు ఎట్టిపరిస్థితిల్లోనూ బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు కనిపించడం లేదు. ఇక మిగిలిన వారు మాత్రం గులాబీగూటికి త్వరలో వెళ్లనున్నట్టు సమాచారం. వీరి రాకతో వరుసగా చేరికలు ఉంటాయని గులాబీ నాయకత్వం అంచనా వేసింది. దీంతో ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయని, పార్టీకి మైలేజీ వస్తుందని, తిరిగివచ్చిన వారికి ఎంతమేర ప్రాధాన్యత, పదవులు ఇవ్వాలనేది తర్వాత నిర్ణయించాలనే భావనలో అధినాయకత్వం ఉందని పార్టీ నాయకుల ద్వారా తెలిసింది.

# యువతకు సర్కార్ గుడ్ న్యూస్!

**న్యూస్ డెస్క్ ,15 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాజీవ్ యువ వికాసం పథకం విషయంలో కీలక అప్ డేట్ వెలువడింది. నవంబర్ 19 నుంచి రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులకు రూ.1 లక్ష వరకు స్వయం ఉపాధి ఆర్థిక సాయం అందించేలా చర్యలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. ఇవాళ ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క, అడ్లూరి లక్ష్మణ్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పనితీరుపై ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

యువతకు స్వయం ఉపాధి కల్పనే మా లక్ష్యం:

ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల సంక్షేమం, విద్యాభివృద్ధి, యువతకు స్వయం ఉపాధి కల్పనే మా ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని విద్యారంగ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని భట్టి స్పష్టం చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు కేంద్రీకృత వంటశాలల ఏర్పాటును వేగవంతం చేయాలని, పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని సూచించినట్లు భట్టి తెలిపారు. అలాగే స్టడీ సర్కిళ్ల ద్వారా అత్యుత్తమ శిక్షణ, ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టే దిశగా నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు.

# గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే పారిశుధ్య ప్రణాళిక సిద్ధం చేయాలి

**మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచి..**
**వేతనాలు పెంచాలి**
**సమాన పనికి సమాన వేతనం**
**ఇవ్వాలి -- పనిముట్లు, రక్షణ**
**పరికరాలు అందించాలి**



రాజమహేంద్రవరం(ఇది కద నిజం) సెప్టెంబర్ 15 : రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రాజమహేంద్రవరం నగరంలో పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయాలని, అందుకు తగిన సంఖ్యలో మున్సిపల్ కార్మికులను ఇప్పటి నుంచే పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిటీ అధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఈరోజు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి కార్మికుల సమస్యలు, పుష్కరాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు రాజమహేంద్రవరానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున నగరంలో పారిశుధ్య నిర్వహణకు భారీగా అదనపు సిబ్బంది అవసరమవుతుందని తెలిపారు. పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి సిబ్బందిని హడావుడిగా సమకూర్చడం కాకుండా ఇప్పటి నుంచే అవసరమైన సిబ్బంది సంఖ్యను గుర్తించి నియామకాలు చేపట్టాలని కోరారు.

మున్సిపల్ కార్మికులు ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం, నగర పరిశుభ్రత కోసం అత్యంత కష్టపడి పనిచేస్తున్నప్పటికీ వారికి సరైన వేతనాలు, రక్షణ సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకే పని చేస్తున్న కార్మికుల మధ్య వేతనాల్లో వ్యత్యాసాలు ఉండటం అన్యాయమని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు, పని భారాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలని కోరారు.

అదేవిధంగా కార్మికులకు నాణ్యమైన పనిముట్లు, గ్లౌజులు, మాస్కులు, బూట్లు, ఇతర రక్షణ పరికరాలను తక్షణమే అందించాలని కోరారు. సరైన పరికరాలు లేకుండా కార్మికులతో ప్రమాదకర పరిస్థితుల్లో పని చేయించడం సరికాదన్నారు.

“గోదావరి పుష్కరాలకు వచ్చే ప్రతి భక్తుడు పరిశుభ్రమైన వాతావరణంలో, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పుణ్యస్నానం చేసి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. అందుకు మున్సిపల్ కార్మికులే కీలకం. కాబట్టి వారి సమస్యలను పరిష్కరించి, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత” అని తాటిపాక మధు అన్నారు.

# పెన్షన్,దరఖాస్తులు గడువును
## పొడగించాలి- గోవిందు రంగయ్య మాదిగ



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ గడువును అదనంగా రెండు రోజులు పెంచాలని, మధ్యలో శనివారం, ఆదివారం, సోమవారం సెలవు రావడం వలన పెన్షన్ దారులు కొంచెం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పరిగణంలోకి తీసుకొని 16 వ తేదీ తరువాత రాష్ట్ర ప్రభుత్వం మరి రెండు రోజులు పెన్షన్ దరఖాస్తుల అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య మాదిగ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యలు పరిష్కరించాలి
## -ఎస్సి ,ఎస్టీ అట్రాసిటీ నాయకులు అంకెష్



నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):-నెల్లూరు జిల్లా రాపూరు మండల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అధ్యక్షులు కొప్పల అంకెష్ మంగళవారం రాపూరు మండల రెవెన్యూ అధికారి లక్ష్మీ నరసింహ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

అనంతరం రాపూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ ప్రజలు రెవెన్యూ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి లక్ష్మీ నరసింహ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అధ్యక్షులు కొప్పల అంకెష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో నెల్లూరును రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలపాలి

**ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలు**
**నూటికి నూరు శాతం ప్రజలకు**
**చేరాలి**
**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**
**జిల్లా పనితీరు సూచికల లక్ష్యాల**
**సాధనలో అధికారులు చురుగ్గా**
**పనిచేయాలని పిలుపు**



నెల్లూరుజిల్లా కలెక్టరేట్(ఇది కద నిజం):-అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో, లక్ష్యసాధన దిశగా మరింత చురుగ్గా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మంగళవారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 8వ కలెక్టర్ల సదస్సులో జిల్లాకు సంబంధించిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై చర్చించిన అంశాలు, జిల్లాలో శాంతి భద్రతలు, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

తొలుత జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు.

అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతిని కలెక్టర్ వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సేవా రంగం, పరిశ్రమలు, గృహ నిర్మాణం, నీటిపారుదల, మున్సిపాలిటీలు, రహదారుల నిర్మాణం, విద్య, సంక్షేమం తదితర ప్రాధాన్యత రంగాల్లో పనితీరును మరింత మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద 25 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు అందించి రాష్ట్రంలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపిన అధికారులను ఆయన అభినందించారు.

అదేవిధంగా రామాయపట్నం పోర్టు అభివృద్ధి, బీపీసీఎల్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో కీలకంగా పనిచేసిన రెవెన్యూ అధికారులను కూడా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో ప్రధానమంత్రి చేతుల మీదుగా బీపీసీఎల్ పరిశ్రమకు భూమిపూజ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే సమాయత్తమై సంబంధిత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు నూటికి నూరు శాతం చేరేలా సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి శాఖ పనితీరును మరింత మెరుగుపరచి రాష్ట్రంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్ఓ విజయ్ కుమార్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హన్మకొండలో నడిరోడ్డుపై వ్యక్తి ఆత్మహత్య




**హనుమకొండ సెప్టెంబర్ 15 (ఇది కద నిజం న్యూస్)**

నడిరోడ్డుపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లాలో కలకలం రేపింది.సుబేదారి నాయుడు కుండా బిర్యానీ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి డివైడర్ మధ్యలోని చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు సమాచారం.రహదారి మధ్యలో వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉంది.వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు కూడా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# శరీరానికే అంగ వైకల్యం... భక్తికి కాదని నిరూపిస్తున్న దివ్యాంగుడు..!!
## 15 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న అంగవైకల్య దివ్యాంగుడు మధు కళ్యాణ్..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 15: కడపజిల్లా.. ప్రొద్దుటూరు పట్టణంలోని ఈశ్వర్ రెడ్డి నగర్‌లో దివ్యాంగుడైన మధు కళ్యాణ్ గత 15 సంవత్సరాలుగా వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తూ స్థానికులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. పుట్టుకతోనే వికలాంగుడైనా.. వినాయక స్వామి వారిపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలతో గత 15 సంవత్సరాలుగా ప్రొద్దుటూరు పట్టణంలో భక్తి, నిష్టకు నిలువెత్తు రూపంగా నిలుస్తున్నాడు. కళ్యాణ్. శరీరానికి ఉన్న వికలాంగత్వం అతని నడకను మాత్రమే పరిమితం చేసింది కానీ, అతని సంకల్పాన్ని, స్వామివారిపై ఉన్న భక్తి నైతే రవ్వంతైనా తగ్గించ లేకపోయింది. గత 15 ఏళ్లగా వినాయక చవితి వస్తోందంటే చాలు... కళ్యాణ్ ఉత్సాహానికి హద్దులుండవు. తన వీధిలో వినాయక మండపాన్ని ఏర్పాటు చేసే బాధ్యత నంతా తానే దగ్గరుండి చూసుకుంటాడు. పూల అలంకరణల నుంచి కంటికి ఇంపుగా ఉండే విద్యుత్ కాంతుల లైటింగ్ వరకు ప్రతీ విషయంలోనూ తన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాడు. అంగవైకల్యాన్ని జయించి, మండపం వద్ద నిరంతరం శ్రమిస్తూ అతడు చేసే హడావుడి వీధి ప్రజలందరినీ ఆకట్టుకుంటుంది. నవరాత్రుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామి వారికి నియమ నిష్టలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాడు. కేవలం పూజల తోనే సరిపెట్టకుండా, భక్తి శ్రద్ధలతో ప్రతిరోజూ అన్న ప్రసాదలు పంపిణి చేస్తుంటాడు. శారీరక పరిమితులు ఉన్నప్పటికీ, దైవ సేవలో కళ్యాణ్ చూపుతున్న ఈ అపారమైన భక్తి, నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తన వీధిలో వినాయక నవరాత్రులను ఓ పండగలా కాకుండా, అంతా కలిసి జరుపుకునే ఒక వేడుకలా మలిచిన కళ్యాణ్ ప్రయత్నాన్ని స్థానికులంతా కొనియాడు తున్నారు.. మద్దిలేటి, మధు, కళ్యాణ్ ప్రతి రోజు విఘ్నేశ్వరుడి పూజలు నిర్వహించి, హారతి ఇవ్వడం, ఏర్పాట్లను పర్యవేక్షించడం ఈ వైభవానికి మూలస్తంభం. పుట్టుకతోనే వికలాంగు డైన కళ్యాణ్ స్వామి పై ఉన్న భక్తితో గత 15 సంవత్సరాలుగా ఏ లోటూ రాకుండా తనే ముందుండి వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాడు.. తన తల్లి దండ్రులు తోబుట్టువులు స్నేహితుల సహాయంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తాడు.

# వైన్స్ ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం
## మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఉద్రిక్తత

**ఇది కద నిజం న్యూస్**
**నర్సింహులపేట సెప్టెంబర్ 15**




మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని మధుర వైన్స్ ఎదుట దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. వైన్స్ నిర్వాహకులు యాకయ్య, స్వాతి దంపతులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసనకు దిగారు.తమ బెల్ట్ షాపుపై అబ్కారీ అధికారులు దాడి చేసి సుమారు రూ.40 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారని దంపతులు ఆరోపించారు. వైన్స్ షాప్ నిర్వాహకుల అనుమతితోనే మద్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్నామని వారు పేర్కొన్నారు.అలాంటప్పుడు తమపై మాత్రమే చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్స్ నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తమకు న్యాయం చేయాలని అబ్కారీ అధికారులను కోరుతూ ఆందోళన చేపట్టారు.ఘటనతో వైన్స్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.అధికారులు స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# జనగామలో సెప్టెంబర్ 17న సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

**ఇది కద నిజం న్యూస్ జనగామ సెప్టెంబర్ 15**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముగింపు ఉత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 17న జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభను ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేక మంది అమరులయ్యారని గుర్తుచేశారు.అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు జిల్లాలో వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల ముగింపులో భాగంగా సెప్టెంబర్ 17న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.నాడు తెలంగాణ ప్రాంతంలో నైజాం పాలకులు, రజాకార్లు, దోపిడీదారులు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరిచి పోరాటానికి నడిపించారని అన్నారు. దొరలు, భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ప్రజలు స్వేచ్ఛను సాధించారని తెలిపారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో పేదలకు సుమారు పది లక్షల ఎకరాల భూములు పంపిణీ చేసిన చరిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఉందన్నారు.అయితే నాడు పేదలు పోరాడి సాధించుకున్న భూములను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివిధ విధానాల పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని కనకారెడ్డి విమర్శించారు. దీని ఫలితంగా రైతులు భూములు కోల్పోయి కూలీలుగా మారే పరిస్థితి ఏర్పడుతోందన్నారు.భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. 22ఏ కింద భూములను చేర్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. భూభారతి చట్టం ద్వారా రైతులకు పెద్దగా ఒరిగిందేమీ లేదని, మాటలు తప్ప చేతల్లో మాత్రం ఫలితాలు కనిపించడం లేదని విమర్శించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేయడంలో భాగంగానే ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు, కార్మికులు, కూలీలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.సభకు ముఖ్య అతిథిగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్ హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, చుంచు విజేందర్, నాయకులు బాల్నే వెంకట మల్లయ్య, నల్ల సాత్విక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం
## స్టేషన్ ఘనపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండు ఖాళీలు

**ఇది కద నిజం న్యూస్ జనగామ, సెప్టెంబర్ 15**

స్టేషన్ ఘనపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్ ప్రకాష్ తెలిపారు.కొడకండ్ల మండలంలోని లక్ష్మక్కపల్లి, పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామాల్లో చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ నంబర్ డి/1112/2026, తేదీ 15-09-2026న జారీ చేసినట్లు తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండి, 40 సంవత్సరాల లోపు వయసు కలిగిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను 18-09-2026 సాయంత్రం 5 గంటలలోపు రెవెన్యూ డివిజనల్ అధికారి, స్టేషన్ ఘనపూర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయం లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆర్డీవో కిరణ్ ప్రకాష్ సూచించారు.

# సినిమా న్యూస్




## '418' రిలీజ్ వాయిదా

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పణలో, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న సరికొత్త ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ '418'. ఈ సినిమాతో కీర్తన నాగగౌడ్ దర్శకురాలిగా టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ లభించింది. మొదట ఈ సినిమాను సెప్టెంబర్ 18న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే సినిమా విడుదలకు కేవలం మూడు రోజులు మాత్రమే సమయం ఉండగా, చిత్రబృందం తాజాగా ఈ మూవీ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. సినిమా విడుదల వాయిదా పడటానికి ప్రధాన కారణాలను మేకర్స్ వివరిస్తూ.. ఈ చిత్రానికి విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు. దీనివల్ల సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

అంతేకాకుండా, ఎంపిక చేసిన ప్రేక్షకులు, సినీ పరిశ్రమ ప్రముఖుల కోసం నిర్వహించిన స్పెషల్ ప్రీమియర్ షోల నుంచి కూడా చిత్ర యూనిట్‌కు ఎంతో ప్రోత్సాహకరమైన రివ్యూలు వచ్చాయని అన్నారు. ఈ చిత్రాన్ని చూసిన ఇతర భాషా మార్కెట్ల ప్రదర్శకులు సైతం చాలా పాజిటివ్‌గా స్పందించారని తెలిపారు. ఈ సినిమాను కేవలం తెలుగులోనే కాకుండా, ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. దక్షిణాది భాషలతో పాటు హిందీలో కూడా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ఉన్న మంచి అవకాశాలను నిర్మాతలు పరిశీలిస్తున్నారట. ఎక్కువ మంది థియేటర్లలో ఈ హారర్ చిత్రాన్ని చూసేందుకు వీలుగా, అన్ని భాషల్లో కలిపి ఒకేసారి విడుదల చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల, గతంలో అనుకున్నట్లుగా సెప్టెంబర్ 18న '418' సినిమా విడుదల కావడం లేదని స్పష్టం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

## 'ఆస్మాన్'లో యాక్షన్




దివంగత నటుడు శ్రీహరి తనయుడు మేఘాంశ్ హీరోగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'ఆస్మాన్'. ఈ సినిమాలో రాయంచ హీరోయిన్‌గా నటిస్తుండగా.. యువ దర్శకుడు రామ్ నందన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కొండారు శ్రీనివాస సమర్పణలో శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్‌పై వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, కన్నడ, మలయాళ, అరబిక్ వంటి పలు భాషల్లో పాన్-ఇండియా రేంజ్‌లో ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా తెరకెక్కుతుండటం విశేషం. ఈ చిత్రంలో రవివర్మ, కమల్, కేశవ్ దీపక్, నిఖిల్, రాజశేఖర్, సంతోష్, ప్రముఖ నటుడు సత్యరాజ్, రమణ, కుమార్ కీలక పాత్రలలో నటిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సమయంలో.. చిత్రబృందం తాజాగా, ప్రేక్షకులను ఉత్సాహపరిచేలా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 16న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ అప్‌డేట్‌తో పాటు విడుదల చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది. ఆ పోస్టర్‌లో హీరో మేఘాంశ్ హీరోయిన్‌ను వెంటబెట్టుకుని ఒక దీపం పట్టుకుని భయంతో పారిపోతుండగా.. వారి వెనుక కొందరు రౌడీలు వెంటపడుతున్నట్లుగా చాలా సస్పెన్స్‌ఫుల్‌గా డిజైన్ చేశారు. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాలో విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఏ స్థాయిలో ఉండబోతున్నాయో అర్థమవుతోంది.



## ఆనంద్‌తో పెళ్లి..?

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో గత కొంతకాలంగా రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా యంగ్ హీరో ఆనంద్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ కలిసి బ్లాక్‌బస్టర్ హిట్ 'బేబి'తో పాటు 'ఎపిక్'లో జోడీ కట్టడంతో ఆ ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీని చూసి నిజ జీవితంలోనూ వీరు ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. అంతేకాకుండా రాబోయే రోజుల్లో వీరిద్దరూ పెళ్లి పీటలెక్కి కొత్త జీవితాన్ని పంచుకోబోతున్నారంటూ జోరుగా చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న డేటింగ్, పెళ్లి రూమర్లపై వైష్ణవి చైతన్య తాజాగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా అసలు నిజం బయటపెట్టారు. తమ ఇద్దరి మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని ఆమె స్పష్టం చేశారు.

తామిద్దరం కేవలం మంచి కోస్టార్స్ మాత్రమే కాకుండా మంచి స్నేహితులు అని తెలిపారు. ఇండస్ట్రీలో తమ ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు తమ మధ్య ఒక మంచి స్నేహబంధం, ట్రావెల్ ఉందని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఆనంద్ దేవరకొండ పెళ్లి గురించి వస్తున్న చర్చలపై కూడా ఆమె స్పందించారు. రాబోయే మూడు సంవత్సరాలలో పెళ్లి చేసుకునే ఆలోచనలో ఆనంద్ ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. కానీ, తనకు మాత్రం పెళ్లి గురించి ఆలోచించడానికి ఇంకా చాలా సమయం ఉందని, ప్రస్తుతానికి తన పూర్తి దృష్టి కేవలం సినిమాలపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ విధంగా వైష్ణవి చైతన్య తనపై వస్తున్న ప్రచారానికి పూర్తిగా చెక్ పెట్టడంతో పాటు, తమ మధ్య కేవలం స్నేహం మాత్రమే ఉందని చెప్పారు.

## యుద్ధభూమికే భయం




మంచు మనోజ్ హీరోగా, హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పవర్ ప్యాక్డ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'. బ్రిటిష్ పరిపాలనా కాలం నాటి నేపథ్యంలో, మన దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఒక సాహసోపేతమైన విప్లవాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఈ సినిమాలో రష్యన్ బ్యూటీ, 'ప్రిన్స్' ఫేమ్ మరియా రియాబోషాప్కా నటిస్తుండగా, ఆంగ్లేయుల అన్యాయాలను ఎదిరించి పోరాడే యోధుడిగా మంచు మనోజ్ కనిపించనున్నారు. ఈ సినిమాలో సీనియర్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. నేడు ఆమె పుట్టినరోజు కావడంతో, మేకర్స్ ఆమె పాత్రకు సంబంధించిన ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. 'బాహుబలి' చిత్రంలో శివగామి పాత్ర ఎంతటి పేరు తెచ్చిపెట్టిందో, ఈ చిత్రంలో ఆమె అంతకు మించిన ఉగ్రరూపంలో 'కమలారెడ్డి'గా అలరించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.

ఇక విడుదలైన పోస్టర్‌లో ఒక కుర్చీపై తీవ్రమైన కోపంతో కూర్చుని, చేతిలో పెద్ద కత్తి పట్టుకుని ఉన్న రమ్యకృష్ణ లుక్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆమె పాదాల కింద శవాలు, చుట్టూ రక్తపు మడుగుతో ఉన్న ఈ విజువల్స్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. 'ఆమెకు యుద్ధభూమి అంటే భయం లేదు.. యుద్ధభూమియే ఆమెకు భయపడుతుంది' అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ భారీ చిత్రంలో సముద్రఖని, బాలీవుడ్ ప్రముఖ నటుడు అభయ్ డియోల్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. వెల్‌వెట్ సౌండ్, ట్రూ రెడిక్స్ బ్యానర్లపై అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు చిత్రబృందం. మంచు మనోజ్ మాస్ యాక్షన్, రమ్యకృష్ణ ఉగ్రరూపం కలగలిసి రాబోతున్న ఈ పీరియాడిక్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో 'సిగ్మా' సందడి!

యంగ్ హీరో సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సిగ్మా'. ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో కోలీవుడ్ సూపర్ స్టార్ విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. అక్టోబర్ 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్న ఈ చిత్రం ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీంతో సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఈ క్రమంలోనే సినిమా క్రేజ్‌ను మరింత పెంచేందుకు ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్ బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ తమిళ సినిమా తెలుగు రిలీజ్‌పై బిగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'సిగ్మా' చిత్రం తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను ప్రముఖ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఈ సినిమా కోస్టల్ ఆంధ్ర అండ్ తెలంగాణ హక్కులను మైత్రి మూవీ మేకర్స్ సొంతం చేసుకోగా.. సీడెడ్ లో NVR సినిమా విడుదల చేయబోతుంది' అని ఓ పోస్టర్‌ను షేర్ చేశారు.




## రిలీజ్‌కు లైన్ క్లియర్!

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, బింబిసార ఫేమ్ మల్లిడి వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సోషియో ఫ్యాంటసీ మూవీ 'విశ్వంభర'. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తి చేసుకున్నప్పటికీ, గ్రాఫిక్స్ పనుల్లో ఆలస్యం మరియు ఓటీటీ బిజినెస్ కాస్త లేట్ కావడంతో విడుదలపై కొంతకాలంగా సందిగ్ధత నెలకొంది. అటు మెగాస్టార్ చిరు కూడా నెక్స్ట్ సినిమాలపై ఫోకస్ చేసారు. దాంతో విశ్వంభర రిలీజ్ కు అనేక అడ్డంకులు వచ్చాయి.




తాజాగా ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన ఓటీటీ బిజినెస్ క్లియర్ అవ్వడంతో రిలీజ్ కు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'విశ్వంభర' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం సోనీ లివ్‌తో పాటు పోటీపడిన 'అమెజాన్ ప్రైమ్ వీడియో' ఫైనల్‌గా భారీ ధరకు డిజిటల్ రైట్స్‌ను దక్కించుకున్నట్లు సమాచారం. దీంతో థియేట్రికల్ రిలీజ్‌కు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లేనని ఫిలిం నగర్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే 'విశ్వంభర' చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు ఇండస్ట్రీ ఇన్సైడ్ టాక్. అన్ని అనుకున్నట్లు జరిగితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. యువి క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష కథానాయికగా నటిస్తుండగా ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర గనుక సంక్రాంతికి వస్తే బాబీ డైరెక్షన్ లో చిరు చేస్తున్న కాకా సమ్మర్ కు వెళ్లే అవకాశం ఉంది.